స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

- 18 మందికి గాయాలు
- వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్కూల్ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో అతివేగంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలో సోమవారం జరిగింది. సిఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కొడంగల్ పట్టణంలో చదువుకోవడానికి విద్యార్థులు ఆటోల్లో వస్తుంటారు. ఎప్పటి లాగే పలు గ్రామాలకు చెందిన 18 మంది విద్యార్థులు సోమవారం ఉదయం ఆటోలో కొడంగల్‌కు వచ్చారు. కొడంగల్ పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో విద్యార్థుల తలలకు, చేతులకు స్వల్ప గాయాలు అవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. గమనించిన స్థానికులు వెంటనే గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆటోలో పరిమితికి మించి విద్యార్థులు ఉండటం, అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎసిబి వలకు అవినీతి చేప చిక్కింది. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలోని నంచర్ల గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ పనుల్లో భాగంగా మాజీ ఎంపిటిసి సువర్ణ రూ.4,41,321తో రెండు సిసి రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను గతేడాది మార్చిలో పూర్తి చేయగా.. బిల్లులను చెక్కు రూపేణా సువర్ణకు పంచాయతీ కార్యదర్శి పాండురంగం అందజేశారు. కాగా, బిల్లులో తనకు రూ.20 వేలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో సువర్ణ ఎసిబి అధికారులను ఆశ్రయించింది.

సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పాండురంగానికి సువర్ణ రూ. తొమ్మిది వేలు లంచం ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని విచారణ చేపట్టారు. పాండురంగంను మంగళవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిబి డిఎస్‌పి బి శ్రీకృష్ణా గౌడ్, ఇన్‌స్పెక్టర్లు లింగస్వామి, ఎఎస్‌కె జిలానీ, అధికారులు ఉన్నారు.

రేపటి వరకు ఇ సెట్ ధ్రువపత్రాల పరిశీలన

- ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన వారు 12,053 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి ద్వితీయ సంవత్సరంలో (లాటరల్ ఎంట్రీ) ప్రవేశాలకు నిర్వహించిన ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్) కౌన్సెలింగ్ ప్రక్రియలో ఇప్పటి వరకు 12,053 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకునేందుకు మంగళవారం వరకే గడువుందని తెలిపారు. బుధవారం వరకు ధ్రువపత్రాల పరిశీలనకు గడువుందని పేర్కొన్నారు.

ఈనెల నాలుగు వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముంటుందని వివరించారు. ఎనిమిదిన తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఇప్పటి వరకు 123 మంది అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. పూర్తి వివరాలకు https://tsecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్‌టిసి కార్మికులు

- మంత్రిమండలి నిర్ణయం
- హైదరాబాద్ చుట్టూ రూ.60 వేల కోట్లతో మెట్రో రైలు విస్తరణ
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కుర్రా సత్యనారాయణ, డా. దాసోజు శ్రవణ్
- వరద ప్రాంతాల్లో పనులకు రూ.500 కోట్లు
- మృతులకుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి కెటిఆర్

కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్‌ఆర్టిసిలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. ఇందుకుగాను విధివిధానాల రూపకల్పనకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన రవాణా, జిఎడి, కార్మిక శాఖల కార్యదర్శులు సభ్యులుగా అధికారుల కమిటీని నియమించింది. అంతేకాకుండా వచ్చే శాసనసభ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని సిఎం కెసిఆర్ నిర్ణయించారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆర్‌టిసిలో పనిచేస్తున్న 43373 మందికి లబ్ధి చేకూరనుంది. ముఖ్యమంత్రి కెసిఆర్ అధ్యక్షతన సోమవారం డా బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. సుమారు ఆరు గంటల పాటు జరిగిన సమావేశంలో మంత్రిమండలి 50కుపైగా అంశాలను చర్చించింది. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టం, సహాయక చర్యలపై కేబినెట్ ప్రధానంగా చర్చించింది. వరద ప్రాంతాల్లో పనుల నిర్వహణకు తక్షణమే రూ.500 కోట్లు విడుదల చేయాలని ఆర్థిక శాఖను సిఎం ఆదేశించారు. వర్షాల్లో సైతం సమర్థవంతంగా విధులు నిర్వహించిన విద్యుత్ శాఖ హెల్పర్, లైన్‌మెన్‌ను పంద్రాగస్టు రోజున సత్కరించాలని కేబినెట్ నిర్ణయించింది. 40 మంది చిన్నారులను కాపాడిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు పాయం మీనయ్య ఘనంగా సన్మానించాలని సిఎం నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత కేబినెట్ నిర్ణయాలను మంత్రి కెటిఆర్ మీడియాకు వెల్లడించారు. ఖమ్మం మున్నేరు నది పొడవునా ఫ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వెంటనే నివేదిక తయారుచేయాలని అధికారులను ఆదేశించింది. వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాలని వ్యవసాయ శాఖను సిఎం ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మృతిచెందిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించాలని కేబినెట్ నిర్ణయించింది.

హైదరాబాద్ చుట్టూ రూ.60వేల కోట్లతో మెట్రోరైలు విస్తరణకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

జెబిఎస్- తూంకుంట, ప్యాట్నీ - కండ్లకోయ,
ఇస్నాపూర్ - మియాపూర్,
మియాపూర్ -లక్‌డికపూల్ ,ఎల్‌బినగర్ -
పెద్దఅంబర్ పేట, తార్నాక - బిబినగర్,
ఎయిర్‌పోర్టు - కందుకూరు, ఉప్పల్ - ఇసిఐఎల్

వరకు మెట్రో రైలు ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేయాలని హెచ్ఎంఆర్‌ను కేబినెట్ ఆదేశించింది. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని కేబినెట్ ఖండించింది. గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులను అసెంబ్లీలో మళ్లీ పాస్ చేయాలని తీర్మానించింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కుర్రా సత్యనారాయణ, డా. దాసోజు శ్రవణ్‌ల ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. అనాథ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వ పిల్లలుగా గుర్తిస్తూ ఒక పాలసీ తయారుచేయాలని సిఎం నిర్ణయించారు.

మహబూబాబాద్ జిల్లాలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటు, నిమ్స్‌లో మరో రెండు వేల పడకలు ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నలుమూలలా నిర్మిస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 50 శాతం ఉచితంగా, మిగతా 50 శాతం నిమ్స్ తరహాలో నిర్వహించాలన్న నిర్ణయానికి కేబినెట్ సమ్మతించింది. బిడి టేకేదారులకు పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. వరంగల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అడిగిన 250 ఎకరాలు కేటాయించేందుకు ఆమోదం లభించింది. హకీంపోర్టు ఎయిర్‌పోర్టును హైబ్రిడ్ పద్ధతిలో పౌర విమాన సేవలకు వినియోగించాలని కేంద్రాన్ని కోరాలని తీర్మానించింది. సౌతిండియా సెంటర్ ఫర్ కాపు కమ్యూనిటీ ఏర్పాటుకు హైదరాబాద్‌లో స్థలం కేటాయింపునకు ఆమోదం లభించింది. మంత్రివర్గం ఆమోదం మేరకు రాష్ట్రంలో మరో ఎనిమిది మెడికల్ కళాశాలల ఏర్పాటు కానున్నాయి.

కాళేశ్వరం వద్ద తగ్గిన గోదావరి ప్రవాహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం వద్ద గోదావరి నదీ ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టాయి. సోమవారం గోదావరి, ప్రాణహిత నదుల నుంచి కాళేశ్వరం పుష్కరఘాట్ వద్దకు 3.15 లక్షల క్యూసెక్కుల నీరుతో వస్తూ లక్ష్మీ బరాజ్ వైపు వెళ్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం (సరస్వతి) బరాజ్ వరద నీరు తగ్గింది. బరాజ్‌కు గోదావరి నది, మానేరు వాగు 37,478 క్యూసెక్కుల నీరు రాగా ఐదు గేట్లు ఎత్తి 7728 క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరి నదిలోకి వదులుతున్నారు. బరాజ్‌లో 10.87 టిఎంసిలకు గాను ప్రస్తుతం 6.324 టిఎంసిలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. లక్ష్మీబరాజ్‌లో వరద ప్రవాహం తగ్గింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బరాజ్‌లోకి వరద ప్రవాహం క్రమ క్రమంగా తగ్గూతూ వస్తోంది. సోమవారం బరాజ్ ఇన్‌ఫ్లో 3,07,830 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా, బరాజ్‌లోని మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు భారీ నీటిపారుదల శాఖ డిఇఇ సురేశ్ తెలిపారు. ప్రస్తుతం బరాజ్ నీటి మట్టం రివర్ బెడ్ నుంచి ఐదు మీటర్లుగా ఉందని ఆయన వెల్లడించారు.

కాంట్రాక్ట్ సహాయ శిక్షణ అధికారులను ఆదుకోండి

- వెంటనే క్రమబద్ధీకరించండి : ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తెలంగాణ కాంట్రాక్ట్ సహాయ శిక్షణ అధికారులను వెంటనే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్టు ఉద్యోగులు మహమ్మద్ నసీరుద్దీన్, నూక తోటి పెదకొండయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో నసీరుద్దీన్ మాట్లాడుతూ.. మల్లెపల్లి ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని, మార్గదర్శకాలను పాటించకుండా తమను కనీసం అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు కూడా చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. 2015-16లో తాము కాంట్రాక్ట్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లుగా విధులు నిర్వహించినా ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదన్నారు. తమకు వెంటనే వేతనాలివ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని తెలిపారు. వాటినీ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ ఉల్లంఘించారని, రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇచ్చి.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తమను ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగి నూకతోటి పెదకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

లచ్చీరాంనాయక్ సేవలు మరువలేనివి

- కమ్యూనిస్టుల పోరాట ఫలితాలే నేటి సంక్షేమ ఫలాలు : చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సీనియర్ నాయకులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు బానోత్ లచ్చీరాంనాయక్ పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, నేటి యువతరానికి ఆయన జీవితం స్ఫూర్తి అని కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు.

సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం చౌళ్లతండాలో సోమవారం బానోత్ లచ్చీరాం సంతాప సభలో ఆయన మాట్లాడారు. నాటి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుంగతుర్తి ప్రాంతం ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పారు. దొరలు, భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం జరిగిన ప్రాంతం తుంగతుర్తి నియోజకవర్గమని, ఈ ప్రాంతంలో ఏ చెట్టును, పుట్టను అడిగినా అమరవీరుల త్యాగాలు గుర్తు చేస్తాయని అన్నారు. దొరల దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లుస్వరాజ్యం కలిసి నడిచిన ఈ ప్రాంత ఎర్రమందారం బానోతు లచ్చీరాంనాయక్ అన్నారు. నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టిన ఆయన చివరి వరకు నీతి, నిజాయితీగా ప్రజల కోసం పని చేశారని చెప్పారు. శత్రువుల నుంచి పార్టీ కార్యకర్తలను కాపాడేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కర్రసాము నేర్పి సాయుధులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నేడు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయంటే కమ్యూనిస్టుల పోరాట ఫలితం తప్ప మరోటి కాదన్నారు. దేశంలో బిజెపి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాద చర్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. బానోతు లచ్చీరాంనాయక్ నిస్వార్థ జీవి అన్నారు. నిరంతరం శత్రువుల దాడులు, దౌర్జన్యాలతో కొట్టుమిట్టాడిన తుంగతుర్తి నియోజకవర్గంలో.. గిరిజన కుటుంబంలో పుట్టి మీసాలు మెలేసి శత్రువులపై సింహంలా గర్జించిన మహానేత లచ్చీరాం అని కొనియాడారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడిన ఆయన ఆశయ సాధనకు యువత కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. తన గ్రామానికి రోడ్డు, కరెంటు, బడి వచ్చిందంటే ఆయన కృషి ఫలితమేనన్నారు. అంతకుముందు లచ్చీరాంనాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పులుసు సత్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోటగోపి, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, కందాల శంకర్‌రెడ్డి, జిల్లాపల్లి నర్సింహారావు, వేల్పుల వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూర రాంబాబు, లచ్చీరాంనాయక్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సైన్స్‌కే భారీ డిమాండ్

- సిఎస్ఇ, అనుబంధ కోర్సుల్లో 94.40 సీట్లు భర్తీ
- 32 కాలేజీల్లో నిండిన వంద శాతం
- రేపటి వరకే సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో సోమవారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎంసెట్ ప్రవేశాల కన్వీనర్ వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో కొత్తగా 7,417 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. 25,148 మంది అభ్యర్థులు వారి సీట్లను మార్చుకున్నారని పేర్కొన్నారు. 174 ఇంజినీరింగ్ కాలేజీల్లో 82,702 సీట్లుంటే, 70,689 (85.47 శాతం) మందికి సీట్లు కేటాయించామని వివరించారు. ఇంజినీరింగ్‌లో ఇంకా 12,013 (14.53 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. నాలుగు యూనివర్సిటీలు, 28 ప్రయివేటు కాలేజీల్లో మొత్తం 32 ఇంజినీరింగ్ కాలేజీల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయని పేర్కొన్నారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లు నమోదు చేయకపోవడం వల్ల 4,701 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించలేదని వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఇడబ్ల్యుఎస్) కోటా కింద 5,610 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. సీట్లు పొందిన అభ్యర్థులు బుధవారంనాటికి ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్‌కు గడువుందని సూచించారు. ఈనెల నాలుగో తేదీ నుంచి ఇంజినీరింగ్ ప్రవేశాల తుది విడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అనుబంధ కోర్సులకే భారీగా డిమాండ్ ఉన్నది. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు చేరేందుకు మొగ్గు చూపుతున్నారు. సిఎస్ఇ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 56,059 సీట్లుంటే 52,922 (94.40 శాతం) సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు. కేవలం 3,137 (5.6 శాతం) సీట్లు మాత్రమే మిగిలిపోయాయని తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అనుబంధ కోర్సుల్లో 17,320 సీట్లకుగాను 13,515 (78.03 శాతం) సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంకా 3,805 (21.97 శాతం) సీట్లు మిగిలిపోయాయని వివరించారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ అనుబంధ కోర్సుల్లో 8,125 సీట్లుంటే, 3,533 (43.48 శాతం) సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఇంకా 4,592 (56.52 శాతం) మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 1,198 సీట్లకుగాను 719 (60.02 శాతం) సీట్లు కేటాయించామని వివరించారు. ఇంకా 479 (39.98 శాతం) సీట్లు మిగిలిపోయాయని తెలిపారు. ఇతర వివరాలకు https://tseamcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాల గడువు 16 వరకు పొడిగింపు

- ఆలస్య రుసుం లేకుండా 6 వరకు అవకాశం
- ప్రయివేటు కాలేజీల్లో చేరాలంటే రూ.500 కట్టాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల గడువును ఈనెల 16 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల ఆరో తేదీ వరకు ఆలస్య రుసుం లేకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, గురుకుల జూనియర్ కళాశాలల్లో చేరేందుకు అవకాశముందని సూచించారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు విద్యార్థులను చేర్చుకోవాలని సూచించారు. అయితే ప్రభుత్వ కాలేజీల్లో ఆలస్య రుసుం లేకుండా ఈనెల 16 వరకు చేరేందుకు అవకాశముందని వివరించారు. ఈ నెల ఏడు నుంచి 16 వరకు ప్రయివేటు కాలేజీల్లో చేరాలంటే రూ.500 కట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల్లోనే ప్రవేశాలు పొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులను కోరారు. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఆ కాలేజీల జాబితాను పొందుపర్చామని వివరించారు.

ఇంటర్ బోర్డు కార్యదర్శికి టిప్స్ కృతజ్ఞతలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ప్రవేశాలకు అవకాశం కల్పించిన ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్‌కు తెలంగాణ ఇంటర్ విద్యాపరిరక్షణ సమితి (టిప్స్) కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు టిప్స్ కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, సమన్వయకర్త మైలారం జంగయ్య, టిజిజెఎల్ఎ-475 ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాల కారణంగా ఇంటర్ ప్రవేశాల గడువును పెంచాలంటూ తమ విజ్ఞప్తికి స్పందించిన కార్యదర్శి పై నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

9,10 తేదీల్లో మహాపడావ్

- కార్మికులంతా జయప్రదం చేయాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తునన ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9,10 తేదీల్లో తలపెట్టిన మహాపడావ్‌ను కార్మికులంతా జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మహాపడావ్ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..29 కార్మిక చట్టాలను సమూలంగా మార్చేసి లేబర్ కోడ్‌లను పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌లకు బంగారు పళ్ళెంలో అందించటాన్ని వ్యతిరేకించారు. పంటకు గిట్టుబాటు ధర, రైతు బీమా, రుణమాఫీ లాంటి డిమాండ్లతో రైతులు ఢిల్లీలో పోరాటం చేసిన సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం బుట్టదాఖలు చేసిందని విమర్శించారు.

కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ఉప ప్రధాన కార్యదర్శి యం నర్సింహ్మ, ఉపాధ్యక్షులు బి చంద్రయ్య, కె ఏసురత్నం, పి ప్రేంపావని, కార్యదర్శులు ఎస్ విలాస్, బి వెంకటేశం, శింగు నర్సింహ్మ రావు, ఓరుగంటి యాదయ్య, పల్లా దేవేందర్ రెడ్డి, ఎండి ఇమ్రాన్, వేకల శ్రీనివాస్, నరాటి ప్రసాద్, ఎన్ కరుణ కుమారి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెం.391/2018

షేక్.కాశింబీ .... వాది

వర్సెస్

షేక్.కాశింపీరా & 3 అదర్స్ ....ప్రతివాదులు

2వ ప్రతివాది అడ్రస్:

షేక్.కాదర్‌మహబూబ్ షరీఫ్, అడ్వకేటు
తండ్రి కాశింపీరా, డోర్.నెం.17-1-338/8,
లక్ష్మినగర్ కాలని, మెయిన్ రోడ్డు, సైదాబాదు,
హైదరాబాదు-500059, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలో వాది నీకు కోర్టు నుండి సమన్లు పంపిన తీసుకోనందున నీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడము ఏమనగా పై దావానందు నీకు ఏమైన ఆక్షేపణలుయున్న యెడల తేది:10-08-2023న ఉదయం 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట నీవు స్వయంగా గాని లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో నీపరోక్షమున తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది: పిడతల రాజశేఖరరెడ్డి
స్థలం : గిద్దలూరు వాది తరుపు అడ్వకేట్, గిద్దలూరు
తేది:31-07-2023
సెల్ నెం.9948897433

వృత్తిదారులకు రూ.లక్ష సహకారమందించాలి

- నిధుల పెంపుపై అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటన చేయాలి : పైళ్ల ఆశయ్య
- కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులవృత్తుల ఆర్థిక పథకం దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని, అర్హత కలిగిన వృత్తిదారులకు తక్షణమే రూ.లక్ష ఆర్థిక సహకారం అందించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం గ్రేటర్ హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు, బిసి అభివృద్ధి అధికారి ఆశన్నకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆశయ్య మాట్లాడుతూ.. జిఒ 5 ప్రకారం కులవృత్తుల ఆర్థిక సహకారం పథకం కింద అందిన ఆన్‌లైన్ దరఖాస్తులను గ్రేటర్ హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ ద్వారా వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. నెల రోజులు గడుస్తున్నా పాతబస్తీలోని చార్మినార్, యాకుత్‌పూరా, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట్, నాంపల్లి ఏరియాలో జిహెచ్ఎంసి అధికారులు వెరిఫికేషన్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రజక వృత్తిదారులు, పైళ్ల ఆశయ్య

అదేవిధంగా వెరిఫికేషన్ పూర్తయిన లబ్దిదారులకు వెంటనే లక్ష రూపాయల చెక్కు అందించాలని డిమాండ్ చేశారు. తమ అనుచరులకే లబ్ది చేకూర్చేలా స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధుల జోక్యం పెరిగిందని, అలాకాకుండా అర్హత కలిగిన వృత్తిదారులకు, పేదలకు ఈ పథకం వర్తించే విధంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కులవృత్తుల ఆర్థిక పథకం (బిసి బంధు) నిధుల పెంపుపై ఆగస్టు మూడు నుంచి జరిగే అసెంబ్లీ సమావేశంలో ప్రకటన చేయాలని కోరారు.

టిఆర్‌విఎస్ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ.. ఇండ్లు, ఇంటి స్థలాలు లేని వృత్తిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రులు, పోలీస్ శాఖలో కులవృత్తి కాంట్రాక్ట్‌ను స్థానిక సొసైటీలకు ఇచ్చేవిధంగా గైడ్‌లైన్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు పి సంజీవ జిల్లా కమిటీ సభ్యులు జి వెంకటేష్, కె శ్రీనివాస్, పి రజిత, టి హేమలత, టి మల్లికార్జున్, ఆర్ బాబు, ఎస్ బాలేష్, ఎన్ బాబు సూరిబాబు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

RELIANCE
Reliance Commercial Finance Limited

నమోదిత కార్యాలయం: ది రూబీ 11వ అంతస్తు, ఉత్తరం-పడమర వింగ్, ప్లాట్ నం.29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (వెస్ట్), ముంబై-400028. (మహారాష్ట్ర)
శాఖా కార్యాలయం : 6-3-248/బి/1, ధృవ్ ఆర్కేడ్, 3వ అంతస్తు, రోడ్డు నం.1, సీవన్ నగర్, బంజారా హిల్స్, హైదరాబాద్-500034.

(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(2) ప్రకారం) స్వాధీనతా ప్రకటన

ఏదైతే, కింద సంతకం చేసిన వ్యక్తి రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (అమలు) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి ఇవ్వబడిన అధికారాలను అమలు చేస్తూ డిమాండ్ నోటీసును జారీ చేశారు. క్రింద వివరించబడిన రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలను పిలుస్తూ నోటీసు తేదీ నుండి 60 రోజులలో చెల్లించాలని కోరడమైనది.
రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలు తెలియజేయునది ఏమనగా రూల్ 8తో చదువుతూ పేర్కొన్న యాక్ట్ యొక్క సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4) క్రింద అతను/ఆమెకు ప్రధానం చేసిన అధికారాలను ఉపయోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీలలో దిగువ వివరించిన ఆస్తులను దిగువసంతకందారుడు స్వాధీనం చేసుకున్నారు.
ముఖ్యంగా రుణగ్రహీత మరియు హామీదారు మరియు సాధారణంగా ప్రజలు ఈ ఆస్తితో వ్యవహరించవద్దని దీని ద్వారా హెచ్చరిస్తున్నారుమరియు ఆస్తికి సంబంధించిన ఏవైనా వ్యవహారాలు రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ కు చెల్లించాల్సిన ఛార్జీలకు లోబడి ఉంటుంది.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

రుణగ్రహీత/సహ రుణగ్రహీత పేరు	డిమాండ్ నోటీసు తేది	స్వాధీనతా తేది	స్వాధీనతా విధానం	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1. సురేంద్ర బాబు సబ్బినేని, 2. సబ్బినేని శాంతిశ్రీ Loan NOs:- RLLPHYD000330879, RLHLHYD000083294, RLLSHYD000344121	18.06.2019	28.07.2023	లాంఛనప్రాయ స్వాధీనత	14.06.2019 నాటికి బకాయి రూ.32,30,67,791/- (ముప్పై రెండు కోట్ల ముప్పై లక్షల అరవై ఏడు వేల ఏడు వందల తొంభై ఒక రూపాయలు మాత్రమే)

ఆస్తి వివరణ : ఆస్తి షెడ్యూల్ : హైదరాబాద్ (ఎపి)-500033, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు నం.8, బ్లాక్ నం.2, జూబ్లీ హిల్స్, రోడ్డు నం.29, సిల్వర్ జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ భవనం సొసైటీ లిమిటెడ్ ఆమోదించిన లే అవుట్ పరిధిలో ఉన్న స్థలం మరియు భవనం మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ షేక్ పేట గ్రామం యొక్క ప్లాట్ నం.512-ఓ వద్ద ఉన్న సర్వే నం.403/1 (పాత) మరియు 120 (కొత్త) మరియు సర్వే నం.102/1 క్రింది విధమైన సరిహద్దులు : తూర్పు: 30' అ.లు. వెడల్పు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.512-పి, పడమర: ప్లాట్ నం.512-ఎన్., ఉత్తరం: 50' వెడల్పు రోడ్డు నం.29.

తేది : 29.07.2023
ప్రదేశం: హైదరాబాద్

సం/- (అధికృత అధికారి)
రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్

నిజామాబాద్ ఐటీ హబ్‌లో కంపెనీని స్థాపించండి

- గ్లోబల్ లాజిక్ సంస్థను కోరిన ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలో ప్రారంభం కానున్న నిజామాబాద్ ఐటి హబ్‌లో కంపెనీని స్థాపించాలంటూ అంతర్జాతీయంగా పేరొందిన ప్రముఖ హిటాచీ గ్రూపు సబ్సిడరీ సంస్థ గ్లోబల్ లాజిక్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. సోమవారం కవితతో సంస్థ వైస్ ప్రెసిడెంట్ గురు కమ కొలను, కంటెంట్ ఇంజినీరింగ్ విభాగం వైస్ ప్రెసిడెంట్ కృష్ణ మోహన్ వీరవల్లి హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, షకీల్ పాల్గొన్నారు. కవిత విజ్ఞప్తిని పరిగణించిన ఆ కంపెనీ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. నిజామాబాద్ ఐటి హబ్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. అక్కడి రవాణా, నీరు, విద్యుత్ సౌకర్యాలతోపాటు శాంతి భద్రతల గురించి కంపెనీ ప్రతినిధులకు కవిత వివరించారు. రవాణా సౌకర్యం విషయంలో ఆర్‌టిసి బస్సులను ఐటి హబ్ వరకు వేయించడానికి కృషి చేస్తానని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో తాము కల్పించే ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో కంపెనీని తెలంగాణలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని పేర్కొన్నారు. మంగళవారం నాడు కంపెనీ ప్రతినిధులు నిజామాబాద్ ఐటి హబ్‌ను సందర్శించనున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ప్రధాన కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న గ్లోబల్ లాజిక్ గచ్చిబౌలి, జూబ్లిహిల్స్‌లో ఉన్న ఆ కంపెనీలో దాదాపు మూడు వేల మంది పనిచేస్తున్నారు

భద్రాచలానికి మరణశాసనం రాసింది బిజెపినే..

- పోలవరం వల్లే ఈ దుస్థితి
- ముంపు అంచనాను నిర్దిష్టంగా వేయాలి
- ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలి
- సిఎం కెసిఆర్ ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలి
- వరదల్లో నష్టపోయిన ప్రతి కుటుంబానికి రూ.25,000 పరిహారమివ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పేరుతో ముంపు మండలాలను ఆంధ్రాలో కలిపి భద్రాచలం ప్రాంతానికి మరణ శాసనం రాసింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ విలీన మండలాలను ఆంధ్రాలో కలుపుతూ తీసుకువచ్చిన ఆర్డినెన్స్ పై మొదటి సంతకం చేశారని తెలిపారు. భద్రాచలం పట్టణంలోని ముంపు ప్రాంతాలు, పునరావాస కేంద్రాలను సోమవారం ఆయనతో పాటు పార్టీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పోతినేని మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వల్లే భద్రాచలానికి ఈ దుస్థితి ఏర్పడిందని, ఈ ప్రమాదాన్ని సిపిఎం 2007లోనే పాలకుల దృష్టికి తీసుకొచ్చి అనేక ఆందోళనా పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఆ సందర్భంగా పార్టీ కార్యకర్తలపై కాల్పులు జరిపి జైలుకు పంపి 17 ఏళ్లుగా కోర్టుల చుట్టూ తిప్పించిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. నేడు సిడబ్ల్యుసి సైతం పోలవరం బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని ప్రకటించిందని తెలిపారు. ఇప్పటికైనా పోలవరం ముంపు అంచనాను నిర్దిష్టంగా వేయాలని కోరారు. ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపడం ద్వారానే భద్రాచలానికి భవిష్యత్తు ఉందని, అందుకు కేంద్ర ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చించేందుకు చొరవ చూపాలని, ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావాలని అన్నారు. నిత్యం రాముని జపం చేసే బిజెపి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భద్రాచలం రాముని గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎపి ముఖ్యమంత్రితో మాట్లాడి కరకట్ట పొడిగించేందుకు ఉన్న ఆటంకాలను తొలగించి సమస్య పరిష్కరించాలని కోరారు. భద్రాచలం పట్టణం వరద ముంపునకు గురి కాకుండా శాశ్వత ప్రాతిపదికన స్లూయిజులు రిపేరు చేయించి మోటార్లు ఏర్పాటు చేయాలని, తగిన సిబ్బందిని నియమించాలని తెలిపారు. వరద వచ్చినప్పుడే కాకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని, తగిన నిధులు విడుదల చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రకటించిన రూ.వెయ్యి కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. వరద ముంపునకు గురై పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రతి కుటుంబానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలని లేకుంటే సిపిఎం ప్రజా పోరాటాలకు శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని జాగ్రత్తలు తీసుకున్న జిల్లా కలెక్టర్, యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ.. భారీ వర్షాలు వరదల కారణంగా ధ్వంసమైన రోడ్లు, చెరువులను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. జిల్లాలో పంటలు పూర్తిగా నీట మునిగి నష్టం ఏర్పడిందని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. వరదలు. వర్షాల నేపథ్యంలో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య బృందాలను గ్రామాలకు అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, కె బ్రహ్మాచారి, ఎంబి నర్సారెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో వ్యతిరేక నినాదాలు చేస్తున్న బిజెపి నాయకులు

బిజెపిలో భగ్గుమన్న విభేదాలు

- వ్యక్తిపూజ చేసే వారికే పదవులిస్తున్నారని సీనియర్ల మండిపాటు
- పార్టీ జిల్లా కార్యాలయాన్ని ముట్టడించిన బిజెపి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఎంపి అరవింద్, పార్టీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య ఒంటెద్దుపోకడలకు పాల్పడుతూ.. పార్టీ కోసం పని చేసే వారికంటే.. వ్యక్తిగత పూజ చేసే నాయకులకే పదవులు కట్టబెడుతున్నారని బిజెపి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాలకు చెందిన బిజెపి నాయకులు జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ప్లకార్డులు చేతబట్టి వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఏర్పాటుచేసిన మండల కమిటీల్లో.. 13 మండలాలకు చెందిన మండల నాయకులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎంపి అరవింద్‌కు జై కొట్టిన వారికే పదవులు ఇచ్చారని తెలిపారు. తామంతా పార్టీ కోసం పనిచేసే వ్యక్తులమని, వ్యక్తుల కోసం పనికోసం పనిచేయడం లేదని స్పష్టంచేశారు. ఎంపీ అరవింద్ ఒంటెద్దు పోకడలపై వెంటనే రాష్ట్ర పార్టీ నాయకులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కమిటీల్లో పాత వారికే ప్రాధాన్యత ఇచ్చి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

టికెట్ నాకే.. గెలుపు నాదే..

- చివరి శ్వాసవరకు కాంగ్రెస్‌లోనే..
- పార్టీ మార్పు పుకార్లపై స్పందించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ నాదే.. గెలుపు కూడా నాదే. ఇందులో ఎలాంటి అనుమానాల్లేవు.. చివరి శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే జీవితం" అని టిపిసిసి ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. పార్టీ మార్పుపై వస్తున్న పుకార్లను ఆయన ఖండిస్తూ సోమవారం సూర్యాపేటలోని రెడ్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున తాను బరిలో ఉంటానన్నారు. మెజార్టీతో గెలుస్తానని చెప్పారు. అదేవిధంగా పార్టీ మారుతున్నట్టు వస్తున్న తప్పుడు ప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్‌తో పాటు కొంతమంది సొంత పార్టీ నాయకులు పనికట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దయచేసి ప్రజలు, కార్యకర్తలు ఎవరూ దుష్ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ నాయకులు ఎవరూ నన్ను సంప్రదించలేదని స్పష్టం చేశారు. తనను పార్టీ మారమని అడిగే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదన్నారు. తన పుట్టుక కాంగ్రెస్ అని, చివరి శ్వాస వరకు పార్టీలోనే ఉంటానని చెప్పారు. లోకల్, నాన్‌లోకల్ అని ప్రచారం చేయడం కరెక్టు కాదన్నారు. 40 ఏళ్ల సూర్యాపేట కేంద్రంగా రాజకీయాల్లో ఉన్నాననే సంగతి పార్టీ మిత్రులు గమనించాలని కోరారు. ఎవరూ పార్టీలో లేనప్పుడు తానొక్కడినే ఎమ్మెల్యేగా గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కోసం పని చేశానని, ఇండిపెండెంట్‌గా తుంగతుర్తి నుంచి పోటీ చేసి గెలిచానని అన్నారు. టిఆర్ఎస్ ఆవిర్భావ సమయంలో కెసిఆర్ పార్టీలోకి రావాలని కోరినా వెళ్లలేదన్నారు. ఇప్పుడు కావల్సింది ప్రతిపక్ష నాయకులను పార్టీలోకి లాక్కోవడంపై దృష్టి పెట్టడం కాదని, వర్షాలతో నష్టపోయిన ప్రజలకు, రైతులకు చేయూతనందించాలని కోరారు. తనకు ఎలాంటి గ్రూపులు లేవని, తనది కాంగ్రెస్, సోనియా గ్రూపు అని చెప్పారు. పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీ మార్పు కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు.

రేపటినుంచి దోస్త్ ఇంట్రా కాలేజీ విడత

- 7 నుంచి ప్రత్యేక విడత కౌన్సెలింగ్
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ఇంట్రా కాలేజీ విడత కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బుధవారం నుంచి ఈ నెల నాలుగో తేదీ వరకు ఇంట్రా కాలేజీ విడతలో అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని తెలిపారు. ఐదున సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ నెల ఏడు నుంచి ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. ఈ నెల 13 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశముందని తెలిపారు. ఏడు నుంచి 14 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని సూచించారు. 17న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేరోజు నుంచి 21 వరకు సీట్లు కేటాయించిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని కోరారు. 18 నుంచి 21 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు..

నేరచరితులకు టికెట్లు ఇవ్వొద్దు

- ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చర్చావేదికలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకులను గుర్తించి ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని పలువురు వక్తలు అన్నారు. అలాంటివారికి టికెట్లు ఇవ్వొద్దంటూ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో 'ఎన్నికలు- అభ్యర్థుల ఎంపిక' అనే అంశంపై సోమవారం ఆ సంస్థ చైర్మన్ పద్మనాభరెడ్డి అధ్యక్షతన చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోకసత్తా పార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీకి డబ్బు, కులం ప్రధాన అంశంగా మారిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే కనీసం రూ.40 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే చెబితేనే కేసులు నమోదు చేయడంతోపాటు తొలగింపు, విచారణ జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. నేర వ్యవస్థను తొలగించాలంటే చట్ట బద్ధ పాలన జరగాలన్నారు. ఎన్నికల వ్యవస్థ మారాలని, నేరం చేసిన వాళ్ళు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవాలని సూచించారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఆకునూరు మురళి మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కూతురే స్వయంగా తన తండ్రి కబ్జాదారు అని చెప్పడం శుభపరిణామమన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలకు ఎన్నికల్లో పోటీచేసే అర్హతలేదన్నారు. బాండ్ పేపర్‌పై ఎమ్మెల్యే అభ్యర్థులకు ఉండాల్సిన అర్హతలను రాసి సభలలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి నియోజకవర్గాలు కాకుండా 40 నియోజకవర్గాలలో రూ.200 కోట్లకుపైగానే ఖర్చు చేస్తున్నారనీ, అయినా ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సీనియర్ సంపాదకులు దిలీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు, రాజకీయాలు పూర్తిగా వ్యాపారమయమయ్యాయని వాపోయారు. ఎలక్షన్లు ఇన్వెస్ట్‌మెంట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రాఫిట్ మేకింగ్ మేనేజ్‌మెంట్‌గా మారాయని చెప్పారు. అవినీతికి పాల్పడినవారిక ఎన్నికల్లో టికెట్లు ఇవ్వొద్దని పార్టీలకు సుప్రీంకోర్టు సూచించిందనీ, అయినా అది ఎక్కడా అమలుకావడంలేదన్నారు. మునుగోడు ఎన్నికలలో ఓటు వేయడానికి లైన్లో ఉన్న ప్రజలకు డబ్బులు పంచినా ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదన్నారు.

గురుకులంలో కళ్ల 'కలక'లం..!

- వేగంగా విస్తరిస్తున్న బ్యాక్టీరియా
- కంటి సమస్యలతో బాధపడుతున్న పిల్లలు, పెద్దలు
- అత్యధిక కేసులు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు కండ్ల కలకతో బాధపడుతున్నారు. ఈ నెల 24న తొలుత పది మంది పిల్లలకు కండ్ల కలక వచ్చింది. మూడు రోజుల్లోనే 250 మందికి వ్యాపించింది. అప్రమత్తమైన అక్కడి వైద్యాధికారులు పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించి చికిత్స అందించారు. పిల్లలంతా ఒకే దగ్గర ఉండటంతో ఈ వ్యాధి వేగంగా వ్యాప్తి చెందిందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక చోట్ల ఈ వ్యాధితో పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వ్యాధి సాధారణమైనదే అయినా.. వారం రోజులపాటు బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రస్తుతం విద్యా సంస్థల్లోనే కాకుండా ఇతర జన సమూహాలు ఉన్న ప్రాంతాల్లోనూ ఈ బ్యాక్టీరియా వేగంగా వ్యాప్తి చెందడం ఆందోళనకరంగా మారుతోంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్నట్టు తెలుస్తోంది. కంటి గుడ్డు చుట్టూ ఉండే తెల్లని పొర, కంటి రెప్పల వెనుక ఉండే పొరను కంజెక్టైనా అంటారు. కండ్లు తెరిచి ఉండటంతో దుమ్ము, ధూళి, వేడి, చలి, నీటితో ఇన్‌ఫెక్షన్‌తో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుంది. మామూలుగా బ్యాక్టీరియా ద్వారా సంక్రమించిన కండ్ల కలక వారం రోజుల్లో తగ్గిపోతుంది. కండ్ల కలక వచ్చిన వారిలో కండ్లు ఎర్రబారటం, నీరు కారడం, కంటి రెప్పలు వాపు లేదంటే ఉబ్బిపోవడం, నిద్రలో కనురెప్పలు అంటుకోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

వాతావరణ మార్పులే కారణమా..?

ఈ కండ్ల కలక వ్యాధి వేగంగా విస్తరించేందుకు వాతావరణ మార్పులే కారణమని తెలుస్తోంది. ఈ వ్యాధి ప్రతి ఏటా సాధారణంగా వచ్చేదే అయినా ఈసారి ఎక్కువ కేసులు నమోదవుతున్నాయి. భారీ వర్షాలు కురవడం.. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈ బ్యాక్టీరియా వేగంగా విస్తరించేందుకు కారణమైందని తెలుస్తోంది. ఒకరి నుంచి మరొకరికి వేగంగా విస్తరిస్తుండటంతో పిల్లలు, పెద్దలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని యాంటీబయాటిక్ మందులు వాడితే సరిపోతుందని వైద్యులు చెబుతున్నారు. కంటిని శుభ్రంగా ఉంచుకోవాలని, బయటికి వెళ్లి వచ్చిన తర్వాత గోరు వెచ్చటి నీటితో ముఖం, కండ్లను కడుక్కొని మెత్తటి శుభ్రమైన టవల్‌తో తుడుచుకోవాలని సూచిస్తున్నారు.

అందరికీ తగ్గిపోయింది
డా.అనిల్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, జైపూర్

కండ్ల కలక వ్యాధి ప్రస్తుతం అంతటా వస్తోంది. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సుమారు 250మంది విద్యార్థులు ఈ వ్యాధితో ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలో ఇప్పటి వరకు తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాం. ప్రస్తుతం విద్యార్థులందరూ కోలుకున్నారు. ఆరుగురు విద్యార్థులకు మాత్రమే చికిత్స కొనసాగిస్తున్నాం. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఐకెపి విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

- కనీస వేతనం, ఇతర డిమాండ్లపై కేబినెట్‌లో చర్చించండి
- మంత్రి ఎర్రబెల్లికి ఐకెపి విఓఎ ఉద్యోగుల సంఘం వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐకెపి విఓఎలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు, రూ.10 లక్షల బీమా సౌకర్యం, తదితర డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ఐకెపి విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. తమ సమస్యల పరిష్కారంపై క్యాబినెట్ సమావేశంలో చర్చించాలని విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు ఆ యూనియన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, తెలంగాణ ఐకెపి విఓఎ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నగేశ్, ఆఫీస్ బేరర్లు వెంకటయ్య, శరత్‌కుమార్, అంజి, వసియా బేగం, రాములు, దుర్గయ్య, రాష్ట్ర నాయకులు కుమార్, ఆంజనేయులు, మల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు. 44 రోజుల సమ్మె సందర్భంగా మంత్రి ఇచ్చిన హామీని ప్రస్తావించారు. సమ్మె విరమించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని వాపోయారు. రాష్ట్రంలో గ్రామ మహిళా సమాఖ్యల ద్వారా పొదుపు సేకరణ, అనేక సంక్షేమ కార్యక్రమాల్లో అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విఓఎల పట్ల ఇలా వ్యవహరించడం తగదన్నారు. కనీస వేతనాల పెంపుదలపై సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి పెంచాలని కోరారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాల చెల్లింపు, అర్హులైన విఏలను సిసిలుగా ప్రమోషన్స్, ఎస్‌హెచ్‌జి, విఏ లైవ్ మీటింగ్స్ రద్దు, జాబ్ చార్ట్‌తో సంబంధం లేని ఆన్‌లైన్ పనులు రద్దు తదితర కోర్కెలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రి ఎర్రబెల్లికి వినతి పత్రం అందజేస్తున్న ఐకెపి విఓఎ ఉద్యోగులు

అసైన్డ్ భూముల్లో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం

- ఆక్రమణలపై త్వరలో హైకోర్టులో పిల్
- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసైన్డ్ భూములతో రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నదని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. పేదలకు చెందిన 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను బలవంతంగా సర్కారు గుంజు కున్నదని ఆరోపించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు పేదలకు ఇచ్చిన ప్రభుత్వ, అసైన్డ్ భూములను బిఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటున్నదని తెలిపారు. బహుజన వాదిననే ముసుగులో దళితులను పదేండ్ల నుంచి కెసిఆర్ నిండా ముంచుతున్నారని విమర్శించారు. భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్‌ను ఉత్తర భారతదేశం నుంచి అరువుకు తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. పేదల భూముల్లో స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు కడుతున్న ప్రభుత్వం కెసిఆర్, కెటిఆర్, కవిత ఫామ్ హౌస్‌లలో డంపింగ్ యార్డ్‌లు, స్మశాన వాటికలు కడితే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. పేద రైతుల దగ్గర భూములను గుంజుకుని బడా బాబులకు బినామీలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములపై విచారణ జరిపిస్తామన్నారు. బలవంతపు ఆక్రమణలపై త్వరలోనే హైకోర్టులో పిల్ వేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ క్వీన్, రాష్ట్ర సెక్రెటరీ గుండెల ధర్మేంధర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాచమల్ల జయసింహ, భూ రక్షణ సమితి నాయకులు మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

- గురుకుల అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి
- డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, పివైఎల్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల బోర్డు ఆధ్వర్యంలో ఈనెల ఒకటి నుంచి 23 వరకు నిర్వహించే రాతపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, పివైఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మల్టీపర్పస్ సెంటర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరాయి. పరీక్షా కేంద్రాలను స్థానిక జిల్లాల్లోనే ఏర్పాటు చేయాలని సూచించాయి. ఒకే అభ్యర్థికి మూడు, నాలుగు జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించడంతో నిరుద్యోగుల్లో గందరగోళం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసు కున్న ప్రతీ అభ్యర్థికీ హాల్‌టికెట్లను ఇవ్వాలని కోరాయి. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, పివైఎల్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గురుకుల భవన్ వద్ద ఉన్న గురుకుల బోర్డ్ కన్వీనర్ మల్లయ్య బట్టు కార్యాలయ ఆవరణలో అభ్యర్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. వారితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. అనంతరం గురుకుల బోర్డ్ డిప్యూటీ కార్యదర్శి తిరుపతయ్యకు ఆయా యువజన సంఘాల బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్ మాట్లాడుతూ జెఎల్, డిఎల్, టిజిటి, పిజిటి, లైబ్రేరియన్ పరీక్షలు రాసే వారికి కేటాయించిన మల్టీపర్పస్ (ఒకే అభ్యర్థి మూడు జిల్లాల్లో పరీక్ష కేంద్రా లు కేటాయించడం) విధానంతో అభ్యర్థులు నష్టపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానంతో సుదూర ప్రాంతాలకు వెళ్లలేని గర్భిణీలు, వికలాంగులు, పిల్లల తల్లులతోపాటు ఆర్థిక స్తోమతలేని నిరుద్యోగులకు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ఎన్నో ఏళ్ళుగా ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తోన్న వారికి ఈ విధానాలు నష్టం చేకూరుస్తున్నాయని విమర్శించారు. ఒకవేళ ఇదే నిబంధనలు విధిస్తే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, గురుకుల నియామక బోర్డ్ అభ్యర్థులందరికీ హెలికాప్టర్ సౌకర్యం ద్వారా పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో గత రెండు వారాలుగా భారీ వర్షాల వల్ల పరీక్ష కేంద్రాలన్నీ దుర్భర స్థితిలో ఉన్నాయనీ, ఇలాంటి సమయంలో గురుకుల బోర్డ్ తీసుకున్న నిర్ణయం అభ్యర్థులకు శాపంలా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లయ్య బట్టు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనీ, నిరుద్యో గులకు నష్టం వాటిల్లే విధానాలు అనుసరిస్తున్నారని వాపోయారు. అభ్యర్థులకు అందుబాటులో లేకుండా ఉంటున్నారని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కన్వీనర్‌ను తొలగించాలనీ, జవాబు దారీతనంగా వ్యవహరించే అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్, పీవైఎల్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి కృష్ణ, నాయకులు రవి కుమార్ తదితర పాల్గొన్నారు.

ఒకే జిల్లాలో పరీక్ష కేంద్రాలుండాలి : టిపిటిఎల్‌ఎఫ్

గురుకుల పోస్టుల రాతపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఒకే జిల్లాలో కేంద్రాలను కేటాయించాలని టిపిటిఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. అభ్యర్థులకు వేర్వేరు జిల్లాల్లో కేంద్రాలు వేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ ఫేర్‌వేల్ పార్టీ

హైదరాబాద్ : బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ కలర్‌ఫుల్‌గా జరిగింది. హోటల్ మేనేజిమెంట్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మొదటి సంవత్సరం స్టూడెంట్స్ ఘనంగా విడ్కోలు పలికారు. దుమ్మురేపే డాన్స్‌లు, కలర్ ఫుల్ ఫ్యాషన్‌షోతో ఆకట్టుకున్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ భూమింగ్‌లో కలినరీ కోర్స్‌లకు మంచి డిమాండ్‌కాలేజీ ప్రిన్సిపల్ రమేష్ రెడ్డి పేర్కొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం

- సిఎం సహాయ నిధికి రెవెన్యూ ఉద్యోగుల ఒక రోజు వేతనం ప్రకటించిన ట్రెసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితులకు రెవెన్యూ ఉద్యోగులు అండగా నిలిచారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఒకవైపు వరద బాధితుల సహాయ చర్యల్లో ప్రత్యక్షంగా విధులు నిర్వహిస్తూనే, మరో వైపు వాటి వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడానికి రెవెన్యూ ఉద్యోగులంతా ఆగస్టు నెలలో ఒక రోజు వేతనాన్ని ఇవ్వాలని నిర్ణయించారు.

ఈ మేరకు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె గౌతమ్‌కుమార్, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ ద్వారా సిఎం సహాయనిధికి సంబంధించిన అంగీకార పత్రాన్ని ప్రభుత్వానికి సోమవారం అందజేశారు. ట్రెసా అసోసియేట్ అధ్యక్షులు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె నిరంజన్, రమేష్‌పాక, కార్యదర్శి చిల్లా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ నజీమ్‌ఖాన్, సిసిఎల్ఎ యూనిట్ అధ్యక్షులు ఎల్లారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె రామకృష్ణ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.